క్లుప్తంగా

కొనసాగుతున్న భూనిర్వాసితుల దీక్ష



దీక్షలో భూనిర్వాసితులు

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన భూమికి చట్టబద్ధ పరిహారం అందజేయాలని మండలంలోని అవుసులోనిపల్లి వద్ద భూనిర్వాసితులు చేపట్టిన దీక్ష శుక్రవారం 15వ రోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగిన దీక్షలో భూనిర్వాసిత రైతులు చిందం నర్సింలు, మరాఠి నర్సింహ తదితరులు దీక్షలో కూర్చున్నారు.

బ్యాంకు మిత్ర సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): బ్యాంకు మిత్ర సేవలు వినియోగించుకోవాలని ఐరిక్స్ జిల్లా మేనేజర్ పి.శంకర్ కోరారు. శుక్రవారం మండలంలోని గురువన్నపేటలో ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు మిత్ర బుడిగే రమేష్ వద్ద పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలను కొమురవెల్లి ఏపీజీవీబీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్యాంకు మిత్ర ఏటీఎం ద్వారా పాస్‌బుక్ ప్రింటింగ్ సేవాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వీవోఏలు బుడిగే వెంకటలక్ష్మి, నాగపూరి సౌమ్య, డ్వాక్రా సంఘాల మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మహేశ్

చిన్నకోడూరు(సిద్దిపేట): యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మేర్గు మహేశ్ అన్నారు. శుక్రవారం చంద్లాపూర్ గ్రామ బీఆర్‌ఎస్వీ కార్యకర్తల సమావేశం రంగనాయక స్వామి గుట్టపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రి హరీశ్ రావు సహకారంతో సిద్దిపేట విద్యాక్షేత్రంగా మారిందన్నారు. ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ రవి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షులు గుజ్జరాజు, నాయకులు పాల్గొన్నారు. అనతంరం గ్రామకమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిల్లి బాలకిషన్, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, ప్రధానకార్యదర్శిగా నాగరాజు, కార్యదర్శిగా మహేందర్ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

జైభీమ్ నగర్ ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలకేంద్రమైన జగదేవ్‌పూర్‌లో దళితులు నివాసముంటున్న కాలనీకి జైభీమ్ నగర్‌గా నామకరణం బోర్డు ఎంపీపీ బాలేషంగౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జైభీమ్ అంటే జ్ఞానం వర్ధిల్లు అని అర్థమని వివరించారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో జైభీమ్ యూత్ అధ్యక్షుడు గణేష్, సర్పంచ్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఇక్బాల్, ఉపసర్పంచ్ మల్లేశం, జై బీమ్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



గోనెపల్లిలో విన్యాసాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలపరిధిలోని గోనెపల్లిలో శుక్రవారం రెడ్డి సంఘం, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తుకుని, డప్పు చప్పుళ్లు, ఒగ్గుడోలు, పోతరాజు విన్యాసాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. పూజల్లో ఎంపీపీ మాణిక్యరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టుకు వైఎస్సార్ పేరు పెట్టాలి

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు పెట్టాలని వైఎస్సార్టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంతంలో రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేస్తూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పారన్న మాటలు గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే గౌరవెల్లి ప్రాజెక్టుకు 2007లో శంకుస్థాపన చేశారన్నారు. అందుకు ప్రాజెక్టుకు వైఎస్సార్ పేరు పెట్టాలన్నారు.

ఎల్లమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణం

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవానికి శుక్రవారం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పూదరి లక్ష్మీనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు పున్న సమ్మయ్య, పచ్చిమట్ల స్వప్న, బత్తిని లక్ష్మయ్య, నమిలికొండ రాజయ్య, పూదరి చంద్రమౌళి, గడిపె వీరయ్య, తాటికొండ పరమేశ్వర్లతో ప్రమాణస్వీకారం చేయించి, అభినందనలు తెలిపారు. తొలుత ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎల్లమ్మ దేవాలయ గోపురానికి రూ.50లక్షలు మంజూరు చేయించామన్నారు. పాలకమండలి సభ్యులు సమష్టిగా ఉండి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్‌పర్సన్ సుధీర్‌కుమార్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి విశ్వనాథశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిని, కౌన్సిలర్లు, గౌడ సంఘం నాయకులు పాలొన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పరిశీలించారు. కాగా టూరిజం శాఖ రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. సుందరీకరణ పనుల్లో భాగంగా ఏ పనులు చేపడుతున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయితే ఎల్లమ్మ చెరువు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని, బతుకమ్మ పండగలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే సతీష్ ఆదేశించారు.

‘స్వచ్ఛ’ పుల్లూరుగా తీర్చిదిద్దుకుందాం

సిద్దిపేటరూరల్: స్వచ్ఛ పుల్లూరుగా తీర్చిదిద్దుకుందామని సర్పంచ్ నరేశ్ అన్నారు.స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆయన ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఆపై గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ తడి, పొడి చెత్త, నీటి నిర్వహణ వంటి అంశాలపై అవగాహన నిర్వహించారు. అనంతరం సర్పంచ్ నరేశ్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు పోటీల్లో పుల్లూరు కూడా పోటీపడుతోందన్నారు. దీనికి సహకరిస్తున్న ప్రజలకు, సుడా చైర్మన్ రవిందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడంలో మంత్రి హరీశ్‌రావు చొరవ ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ, వార్డుసభ్యులు రమేశ్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంటు పాల్గొన్నారు.



డ్రైడే నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు అండగా ప్రభుత్వం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వసతులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజనర్సు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం, పౌష్టికాహారం, వసతి, దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తోందన్నారు. దీంతో విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానంలో నిలువాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాజనర్సు

గోశాల అభివృద్ధికి సహకరించాలి

హుస్నాబాద్ రూరల్: మండలం పొట్లపల్లిలో ఏర్పాటు చేసిన గోశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని టీటీడీ బోర్డు డైరెక్టర్ మురంశెట్టి రాములు అన్నారు. శుక్రవారం గోశాలను ఆయన సందర్శించారు. పశుపోషణ ఒకప్పుడు ఘణనీయంగా ఉండేదని సెలకలు లేకపోవడం వల్ల గ్రామాల్లో పశుపోషణ తగ్గుతుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు కర్ర రవీందర్‌రెడ్డి, సీపీఐ నాయకుడు మాడిశెట్టి శ్రీధర్ ఉన్నారు.



లేగదూడను పరిశీలిస్తున్న రాములు

కులవివక్ష చూపిన దుండగులను శిక్షించాలి

సిద్దిపేటరూరల్: గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేపూర్ మండలం తిమ్మాపూర్‌లో కులవివక్ష చూపిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా అధ్యక్షకార్యదర్శులు బక్కెల్లి బాలకిషన్, నవీన్ డిమాండ్ చేశారు. తిమ్మాపూర్‌లో వివక్షకు గురవుతున్న బాధితులను శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో కలిశారు. అనంతరం కులవివక్షకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరెట్ ఏఓ అబ్దుల్ రహమాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానపరుస్తూ తిమ్మాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు వివక్షకు పాల్పడుతున్నారన్నారు. అవమానం భరించలేక దళితులు స్థానిక తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరసింహులు, కర్ణాకర్, కనకయ్య, రమేష్, రాజు, పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మెగా వైద్య శిబిరం విజయవంతం



వైద్యశిబిరంలో క్యూలో ప్రజలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలకేంద్రంలో హైదారాబాద్‌లోని హైటెక్ సిటీకి చెందిన మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. 536 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాల్కంపల్లి జయంతి మాట్లాడుతూ, సామాజిక సేవా దృక్పథంతో వివిధ కార్పొరేట్ ఆస్పత్రులు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలాగౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పాల్కంపల్లి నరేందర్, వైద్యులు ఆదిత్య సుచరిత, నిఖిల్, ఆస్పత్రి మేనేజర్లు అనిల్ కుమార్, సంతోష్, శ్రీపాద్, బీఆర్‌ఎస్ మండల కోఆప్షన్ ఆజీమొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

హుస్నాబాద్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు రాకుండా ప్రధాని మోదీ అడ్డుకుంటున్నారని సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ఆరోపించారు. సూరత్ హైకోర్టు ఇచ్చిన తీర్పునే కింది కోర్టు సమర్థించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ప్రధాని మోదీ ఫ్లెక్సీ దహనం చేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ, ప్రజల కోసం పోరాడే నాయకులను కేసుల్లో ఇరికించడం సరికాదన్నారు. రానున్న రోజుల్లో దేశంలో, రాష్ట్రంలోని ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, నాయకులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాంద్రాల దాము, సింగిల్ విండో వైస్ చైర్మన్ ముకుందారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాతోనే తెలంగాణ కల సాకారం: సూర్యవర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్‌తోనే తెలంగాణ కల సాకారమైందని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డా.సూర్యవర్మ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌పై సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో ఓబీసీ డిక్లరేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బంక చిరంజీవి, అజ్జు యాదవ్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అన్ని కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండోరోజుకు చేరుకుంది. కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మద్దెల అంజయ్యపాల్గొన్నారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం రెండోరోజుకు చేరింది. వీరికి కారోబార్, పంచాయతీ సిబ్బంది మండల కమిటీ అధ్యక్షుడు సాయన్న, ప్రధానకార్యదర్శి బండారి రాజేశం సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో సుమారు 70 మంది కార్మికులు పాల్గొన్నారన్నారు.

రాయపోలులో..

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన సఫాయి కార్మికులు, ఎలక్ట్రీషియన్, వాటర్ సప్లయ్ కార్మికులు పెద్దసంఖ్యలో నిరసన తెలిపారు. కార్యాలయం ఆవరణలోనే వంటావార్పు చేసి అక్కడే భోజనం చేశారు.

నంగునూరులో...

నంగునూరు(సిద్దిపేట): సీఐటీయూ జిల్లా కార్యదర్శి చొప్పరి రవికుమార్ నంగునూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు శుక్రవారం సంఘీభావం తెలిపారు.

సిద్దిపేట రూరల్‌లో...

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల పరిధిలోని గ్రామపంచాయతీ కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండోరోజుకు చేరింది. వీరికి జీపీ కార్మిక జేఏసీ కన్వీనర్ తునికి మహేశ్ మద్దతు తెలిపారు.జేఏసీ జిల్లా కో కన్వీనర్ తునికి శ్రీకాంత్ పాల్గొన్నారు

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిషత్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది.

బెజ్జంకిలో..

బెజ్జంకి (సిద్దిపేట) : మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

డివిజన్ సాధించే వరకూ ఉద్యమం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని చిట్యాల, తాడూర్‌లో పర్యటించారు. 2 గ్రామాల జేఏసీ కమిటీల ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో చిట్యాల కన్వీనర్‌గా జానకి స్వామి, కోకన్వీనర్లుగా సూర్ణ తిరుపతి, పంజాల ఆంజనేయులు, తిరుమల బాపురాజు, కొల్ల అవినాష్‌రెడ్డి, కార్యదర్శిగా మల్లయ్య, సహాయ కార్యదర్శిగా సహదేవ్, బాల్‌నర్సయ్య, రాజు, తాడూర్ కన్వీనర్‌గా మ్యాకల యాదగిరి, కోకన్వీనర్లుగా నర్రా రాంరెడ్డి, గిర్ని నర్సింహులు, కార్యదర్శిగా నూకల భిక్షపతి, సహాయ కార్యదర్శిగా నర్రా మహేందర్‌రెడ్డి, నర్రా ఉపేందర్‌రెడ్డి మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

సిద్దిపేటరూరల్: వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఏఈఓ నాగార్జున్ అన్నారు. వరి నాటు వేసే సమయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై నారాయణరావుపేట క్లస్టర్ రైతు వేదికలో శుక్రవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విత్తనాలు విత్తడం మొదలుకొని కలుపు తీయడం , కోత కోయడం వరకు మహిళలే కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వరి నారుకు ఆశించే తెగులు నివారణ చర్యలు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని చేబర్తిలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావం నిర్వహించారు. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ వద్ద జెండాను ఎగరవేశారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మండలాధ్యక్షుడు భూమిగారి శ్రీరామ్, పట్టణాధ్యక్షుడు పోతుగంటి కిషోర్ జెండా ఆవిష్కరించారు.

గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కోకన్వీనర్ కృష్ణ, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు మైసరాముల పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నేతలు పూలమాలలు వేశారు. అనాథాశ్రమంలో స్వీట్లు పంపిణీ చేశారు.

జగదేవ్‌పూర్‌లో

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వట్టిపల్లిలో ఎంఆర్‌పీఎస్ జెండాను ఎగరవేశారు. నాయకులు సత్యనారాయణ రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌తోనే పేదల బతుకుల్లో వెలుగులు

దుబ్బాక : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల బతుకులు పూర్తిగా మారుతాయని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివంగత మాజీమంత్రి ముత్యంరెడ్డి ఆశయ సాధన కోసం శ్రీనివాస్ రెడ్డి చేపట్టిన ఆత్మ గౌరవ యాత్ర శుక్రవారం నాటికి 91వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లిలో ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. దుంపలపల్లిలో నెలకొని ఉన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దొంగ హామీలతో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు దుబ్బాకకు చేసేందేమిలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాం నరేందర్, చంద్రయ్య, భరత్ తదితరులు ఉన్నారు.

◆ రైతులకు ఆసరాగా ‘రైతుబీమా’

ములుగు(గజ్వేల్) : వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అన్నదాతకు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం ఆసరాగా నిలుస్తున్నదని కొట్యాల ఎంపీటీసీ వి.మధుసూధన్‌రెడ్డి, అల్లీనగర్ సర్పంచ్ ఎం.భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అల్లీనగర్ గ్రామానికి చెందిన మహిళా రైతు ఆరె సరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా మృతురాలి భర్త సత్యనారాయణకు రూ. 5 లక్షల మంజూరు ప్రొసీడింగ్ పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన రైతు బీమా పథకం విజయవంతంగా అమలవుతుండడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి పృథ్వీరాజ్, రైతులు పాల్గొన్నారు.

◆ పంట నమోదు తప్పనిసరి

రాయపోలు(దుబ్బాక): ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలు నమోదు చేసుకోవడం తప్పనిసరని దౌల్తాబాద్ మండల వ్యవసాయ విస్తరణాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ముబారస్‌పూర్‌లో శుక్రవారం పర్యటించిన ఆయన పలు వ్యవసాయ క్షేత్రాలు సందర్శించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, పంట నష్టపోయినప్పుడు, వర్షాభావం, అతి వర్షం వంటి సందర్భాలలో పంటలు నష్టపోయినప్పుడు ఈ వివరాల ప్రకారం పరిహారం అందుతుందని వివరించారు. రైతులందరూ ఏఈఓలను సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

◆ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ సిద్దిపేట నాయకులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ప్రశాంత్‌నగర్‌లో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే జగ్గారెడ్డి జన్మదినం శుక్రవారం టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దర్గా, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం, అత్తు ఇమామ్‌లు మాట్లాడుతూ సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నంగునూరు మండల అధ్యక్షుడు తప్పేట శంకర్, ఖయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉన్నత పాఠశాలలకు ఫర్నిచర్స్ పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ఫర్నిచర్స్ అందజేశారు. శుక్రవారం మండలంలోని 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు మన ఊరు- మన బడి కింద మంజూరైన బెంచీలు, బల్లలు తదితర ఫర్నిచర్స్ వచ్చినట్లు సీఆర్‌పీ లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఫర్నిచర్స్ దగ్గరుండి అందజేసినట్లు పేర్కొన్నారు.

◆ అర్హులకు ఆర్థిక సాయం

చేర్యాల(సిద్దిపేట): బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం అర్హులకు అందుతుందని 12వ వార్డు కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీష్‌గౌడ్ అన్నారు. వార్డు పరిధిలోని దరఖాస్తుల పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో 354 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర్హులకు పథకం లబ్ధి అందేలా చూడాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మంత్రి తన్నీరు హరీశ్‌రావును కోరారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

◆ సేఫ్టీ మోకులు అందజేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందజేయాలని కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు మేరిండ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురువన్నపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రమాదకర కులవృత్తి నమ్ముకొన్న గీత కార్మికులకు బైక్‌లు, సేఫ్టీ మోకులు అందించాలన్నారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రతి గీత కార్మికుడికీ అందించాలని కోరారు. కార్యక్రమంలో అనగోని నర్సింహులు గౌడ్, బుడిగె ఉప్పలయ్యగౌడ్, గురువయ్యగౌడ్, రమేష్ గౌడ్, నర్సింహులుగౌడ్, హరీష్‌గౌడ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ ప్లేట్స్, నోట్ పుస్తకాల పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోప్పు మల్లేశం కూతురు ఐశ్వర్య జన్మదినం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశానికి హెచ్ఎం దుర్గారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుస్నాబాద్: నియోజకవర్గవ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు పైనుంచి మెయింటనెన్స్ నిమిత్తం సరఫరా నిలివేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం కలుగుతోందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

◆ సెల్‌ఫోన్ అప్పగింత

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్ ఫోన్ ‘సీఈఐఆర్’ టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణ కేంద్రానికి చెందిన బింగి శ్రీనివాస్ సెల్‌ఫోన్ ఈ నెల 1న పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన www.ceir.gov.in అనే వెబ్‌సైట్‌లో సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశాడు. ఫోన్ దొరికిన వ్యక్తి ఫోన్‌లో సిమ్ కార్డు వేయగానే పై వెబ్‌సైట్ ద్వారా వివరాలు స్థానిక పోలీసులకు చేరాయి. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కొండపాక(గజ్వేల్): మండలపరిధిలోని దుద్దెడలో చేనేత కార్మికుడు బొల్లు మల్లేశం (58) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేశం అంత్యక్రియల నిమిత్తం సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహాదేవ్‌గౌడ్ పలువురు దాతలు కలిసి రూ. 21 వేల నగదు, 25 కేజీల బియ్యం, వారానికి సరిపడా నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వడ్లకొండ శ్రీహరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ తిరుపతికి పొట్లపల్లి భజన మండలి

హుస్నాబాద్ రూరల్: తిరుపతిలో జరిగే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొనడానికి పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర్వామి భజన మండలి శుక్రవారం తరలివెళ్లింది. టీటీడీ వారి ఆహ్వానం మేరకు వెళ్తున్నట్లు భజన మండలి సభ్యుడు రంగు తిరుపతి తెలిపారు. వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రతియేటా జరిగే కార్యక్రమానికి పొట్లపల్లి భజన మండలి బృందసభ్యులు పాల్గొంటారు.

◆ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

రాయపోలు(దుబ్బాక): మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి తన స్వంత డబ్బుతో నియోజకవర్గవ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తున్నారని పార్టీ సీనియర్ నాయకుడు ఇప్ప దయాకర్ తెలిపారు. అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా ఎస్ఎస్‌సీ మెమోతో దుబ్బాక క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.